క్లుప్తంగా

నేడు కాజులూరులో గడప గడపకూ..

రామచంద్రపురం రూరల్: నేటి మధ్యాహ్నం 3 గంటలకు కాజులూరు మండలం కోలంక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని మంత్రి అడిషనల్ పీఎస్ పి.తేజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు పట్టణంలో గుడ్ మార్నింగ్ రామచంద్రపురం కార్యక్రమం, 9.30 గంటలకు కాజులూరు మండలం ఆర్యావటంలో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



రాయవరం పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో కమలకుమారి

రాయవరం: స్థానిక రాజేశ్వరి కాలనీలోని మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించారు. ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్, లెసన్ ప్లాన్స్, విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. పాఠశాల అకడమిక్ రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా డీఈవో ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాపరంగా అమలవుతున్న కార్యక్రమాలను ప్రతి ఉపాధ్యాయుడూ విజయవంతం చేయాలన్నారు. ఆమె వెంట రామచంద్రపురం డీవైఈవో నరసింహఫణి, ఎంఈవోలు పి.లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, హెచ్ఎం లచ్చిరెడ్డి వెంకటరమణ, ఉపాధ్యాయులు సత్యనారాయణమ్మ, ఆర్.భాస్కరరావులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ తనిఖీదారుగా సురేష్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్‌కుమార్

రామచంద్రపురం: రామచంద్రపురం డివిజన్ దేవదాయ శాఖ తనిఖీదారుగా వి.సురేష్ కుమార్ శుక్రవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తనిఖీదారుగా పనిచేస్తున్న బాలాజీ రాంప్రసాద్ సెలవుపై వెళ్లడంతో వి.సురేష్‌కుమార్‌ను తనిఖీదారుగా నియమించారు. పలువురు దేవదాయ శాఖ అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



కర్రి చిట్టిబాబును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

కె.గంగవరం: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలోపేతానికి ప్రతి కార్యకర్త పాటుపడాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ పొట్లూరి రామ్మోహనరావు, అనకాపల్లి ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు సూచించారు. మండలంలోని కోటిపల్లిలోని పైండా వారి సత్రంలో శుక్రవారం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బూత్ కమిటీలు పార్టీకి చాలా అవసరమని కమిటీ నియామకం వెంటనే పూర్తి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. అనంతరం మాజీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు జన్మదినం సందర్భంగా పూలదండలు, శాలువాలతో ఆయన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ కన్వీనర్ చాట్రాతి జానకి రాంబాబు, కోకన్వీనర్ సాయిరామ్, నాయకులు అబ్బులు, సలాది శేఖర్, సత్తిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ఆటో బోల్తా పడిన సంఘటనలో ముగ్గురికి పాక్షిక గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మండపేట నుంచి రావులపాలెం వెళుతున్న ఆటో జొన్నాడ మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు పాక్షిక గాయాలయ్యాయి. ఫ్లై ఓవర్ పనుల్లో నిర్లక్ష్యత వల్లే ఈ ప్రమాదాలు జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సంపూర్ణ ఆరోగ్యానికే సురక్ష

- కలెక్టర్ హిమాన్షుశుక్లా
- ద్వారపూడి వైద్య శిబిరం సందర్శన



ద్వారపూడి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

మండపేట: వివిధ రకాల వ్యాధులు, దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ద్వారపూడిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు హెల్త్ అసిస్టెంట్లు అధికారులు ప్రజాప్రతినిధులు గడపగడపకూ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించి అనారోగ్యంగా ఉన్న వారి పేర్లను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేశారన్నారు. శిబిరాల్లో వైద్య నిపుణులతో పైసా ఖర్చు లేకుండా వేలాది రూపాయల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేయించడంతో పాటు బ్రాండెడ్ మందులు అందించడం నిరుపేదలకు సంజీవనిగా నిలుస్తోందన్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీట్ కౌంటర్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, మందుల పంపిణీ కౌంటర్, ఆరోగ్యశ్రీ హెల్ప్ కౌంటర్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్స్ ను ఆయన పరిశీలించారు. పేషెంట్లతో మాట్లాడుతూ ఏ ఇబ్బందితో వచ్చారు, మీ ఇంటికి సర్వే సిబ్బంది వచ్చారా, లేక మీ అంతట మీరే వచ్చారా అని ఆరా తీశారు. శిబిరంలో 351 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అలాగే 92 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 16 మందికి ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. ఎంపీడీఓ ఐ. రాజు, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, సర్పంచ్ ఈతకోటి కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సంగిశెట్టి రమేష్, పోతుల దుర్గాప్రసాద్, సుబ్బరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో 564 మందికి..

కపిలేశ్వరపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం 564 మందికి చికిత్స అందించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చిన్నారుల సమస్యలపై ఏడుగురుకి, గర్భకోశ వ్యాధులు 21, ఆప్తాలమిక్ 56, ఆర్థోపెటిక్ 125, ఈఎన్‌టీ 75, జనరల్ సర్జన్ 2, జనరల్ మెడిసిన్ 85, ఇతర వ్యాధులకు సంబంధించి 193 మొత్తం 564 మందికి చికిత్స అందించారు. వారిలో 11 మందికి మెరుగైన చికిత్స అవసరమని గుర్తించారు. ఐదుగురుకి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించేందుకు నిర్ణయించారు. శిబిరంలో అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి, డాక్టర్లు జీవీ గీతాంజలి, సీహెచ్ రాకేష్ కృష్ణ, ఎస్‌కె.అర్షతునీషా, ఎం.విజయదుర్గ, ఎస్‌వీవీ సత్యనారాయణ చికిత్స చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాన్ని తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, ఉపాధ్యక్షుడు బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లిఖార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

రాయవరం: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి దుర్గారావుదొర, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నదురుబాదలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావుదొర, శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. వైద్యులు వి.సౌమ్య, వంశీకృష్ణ, సీహెచ్.రమ్యశ్రీ, జీఎం చంద్రకుమారిల వైద్య సేవలందించారు. నదురుబాద గ్రామానికి చెందిన 242 మందికి వైద్యసేవలందించి, అవసరమైన వారికి మందులు అందించారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కూళ్ల సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి, వారికి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు సలహాలు, సూచనలు కూడా వైద్య సిబ్బంది ఇస్తారన్నారు. ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్ద పీట వేసిందని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ చిల్లే నాగేశ్వరావు, ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, వైద్యులు మాణిక్యం, పార్వతి, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రత్నకుమారి



నదురుబాదలో రోగులకు మందులు అందజేస్తున్న దుర్గారావుదొర, శ్రీనివాసరావు తదితరులు



కూళ్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న కృషి



శీల వైద్యశిబిరంలో కరపత్రాలు పంచుతూ రోగులకు సూచనలిస్తున్న వైద్యులు, నాయకులు

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగనన్న ఎంతగానో కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు వసుం వెంకటసుబ్బారావు అన్నారు. శుక్రవారం మండలంలోని శీల గ్రామ సచివాలయం ఆవరణలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు తనూజ, సౌజన్య, సునీత, సుప్రియ, శ్రేయ, సురేఖ తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని 452 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ మాట్లాడుతూ గ్రామాల్లో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, సర్పంచ్ కోమలి వెంకటరమణ, దొమ్మేటి కొండ, సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టండి

కార్యకర్తల సమావేశంలో మంత్రి వేణు



పార్టీ కార్యకర్తల సమావేశంలో నాయకులతో కలసి కూర్చున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు తిప్పికొట్టాలని, అలాగే సీఎం అవసరాన్ని ఈ రాష్ట్ర ప్రజలకు కూడా వివరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నేతలు, పార్టీ ప్రజాప్రతినిధులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్ అధ్యక్షతన జరిగింది. తొలుత రఘురామ్ మాట్లాడుతూ ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. నూతనంగా నియమితులైన పార్టీ మండల, పట్టణ కన్వీనర్‌లు ఆయా మండలాల్లో పార్టీ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రతి గ్రామం, వార్డుల్లో పర్యటించి గ్రామ స్థాయిలో కార్యకర్తలను పార్టీ కార్యక్రమంలో పాల్గొనే విధంగా చేయాలని పార్టీ ఆదేశించినట్లు చెప్పారు. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయో లేదో క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు మండల స్థాయి నేతలు గడపగడపకూ పర్యటించి ప్రజలకు కలుసుకోవాలని తెలిపారు. ఈ మేరకు పార్టీ ఆదేశాను సారం ఒక ప్రశ్నావళిని రూపొందించడం జరిగిందని వాటికి ప్రజల వద్ద నుంచి సమాధానాలు రాబట్టాలని తెలిపారు. అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి భిన్నంగా అర్హులైన లబ్ధిదారులందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్ ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. ఎవరైనా సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలు అందకపోతే వారికి కూడా మరో సమయం అందించి వారికి కూడా పథకాలను అందిస్తున్న ప్రభుత్వమిది అని మంత్రి అన్నారు. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపైనా, ప్రభుత్వంపైనా ప్రతిపక్ష టీడీపీ, జనసేన చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి ప్రజల మద్దతును పొందే విధంగా మండల, గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలు పర్యటించాలన్నారు. నియోజకవర్గంలోని మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు అర్హతే ప్రామాణికం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- కోలంకలో గడపగడపకూ..



కోలంకలో మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: జగనన్న పాలనలో సంక్షేమ పథకాల అమలుకు అర్హతే ప్రామాణికమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కోలంకలో మంత్రి వేణుగోపాలకృష్ణ శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని అందరికి వివరించారు. ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం హయాంలో పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెల్లుచీటి పలికారన్నారు. గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారన్నారు. సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టు తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలనీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని పార్టీలు, వర్గవిభేదాలకు తావివ్వకుండా వలంటీర్లు ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ నేరుగా అందిస్తున్నారన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్నామని భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. పలు స్థానిక సమస్యలను ప్రజలు మంత్రి వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకురాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ తొగరు శేఖర్‌బాబు, ఎంపీటీసీ పంపన పద్మావతి, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ దంగేటి అరుణ్‌కుమార్, పార్టీ నాయకులు యాళ్ళ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అర్తమూరులో గడప గడపకూ..



కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి తదితరులు

మండపేట: ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అందుకోసం ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం అర్తమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. గ్రామంలోని గణపతి నగర్, సాయిబాబా గుడి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ అందుకు సంబంధించిన బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను ఆయన అక్కడికక్కడే ఎంపీడీఓ ఐ.రాజు, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్‌తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత సమస్యలతో పాటు క్షేత్ర స్థాయిలో ప్రజా అవసరాలను గుర్తించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతోందన్నారు. సచివాలయానికి రూ. 20 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్న నిధులతో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర అభివద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, చిర్ల జయరామ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత పార్టీ నేతలు మండ నాగిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, తేతలి భూపతిరెడ్డి, నల్లమిల్లి రాంబాబు, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, తేతలి సాయి తదితరులు పాల్గొన్నారు.

రామాలయాల నిర్మాణాలు ప్రారంభించాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతున్న సంఘ నాయకులు. చిత్రంలో పాపారాయుడు

మండపేట: మండపేట నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన 23 రామాలయాలను ఆయా గ్రామాల పెద్దలు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అర్తమూరు విచ్చేసిన ఎమ్మెల్సీ తోట, యువనేత తోట పృధ్వీరాజ్‌లకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు తన నివాసం వద్ద ఘన స్వాగతం పలికారు. తమకు రామాలయం మంజూరు చేయించడం పట్ల రజక సంఘం నాయకులు ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటే వెంట వెంటనే దశల వారీగా బిల్లుల విడుదలకు కృషిచేస్తానన్నారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన పెద్దలు పాపారాయుడు నివాసం వద్ద ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, వెలగతోడు సొసైటీ చైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, పార్టీ నేతలు కుడుపూడి రాంబాబు, వల్లూరి రామకృష్ణ, గారపాటి అశోక్‌కుమార్, పిల్లా అరవరాజు, పలివెల సుధాకర్, పిల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నపూరం
- మండపేటలో రైస్ మిల్లర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట, చిత్రంలో జేసీ శ్రీవాస్ నుపూరం



హాజరైన అధికారులు, రైస్‌మిల్లర్లు

మండపేట: ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం సేకరణకు రైస్‌మిల్లర్లు, అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూరం అజయ్ అన్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ ఏర్పాట్లపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం రైస్‌మిల్లర్లు, సివిల్ సప్లయిస్, రెవెన్యూ, రవాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అక్రమాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలని సూచించారు. ధాన్యం రవాణాచేసే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలని, గోనె సంచులను, వాహనాలను సిద్ధం చేయాలన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి మాట్లాడుతూ ఆర్బీకేలకు, మిల్లులకు మధ్య తేమ శాతం పరీక్షలో వ్యత్యాసం వస్తోందన్నారు. ధాన్యంలో 18 శాతానికి పైగా తేమ ఉన్నప్పటికీ అనుభవ లేమితో ఆర్‌బీకే సిబ్బంది 17 శాతంగా నమోదు చేసి పంపుతున్నారన్నారు. దీనివలన ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని రైస్‌మిల్లర్లకు సుమారు రూ.54 కోట్ల వరకు బకాయిలు సివిల్ సప్లయిస్ నుంచి రావాల్సి ఉందన్నారు. 2.1 లక్షల వరకూ గోనెసంచులు ఆర్‌బీకేల్లో ఉన్నాయని, వాటిని తమకు ఇప్పించాలని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, కర్రి నారాయణరెడ్డి కోరారు. రవాణా చార్జీ బకాయిలు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు.

రైతులకు మేలు జరిగేలా పనిచేయాలి

రైతులకు అన్ని విధాలా మేలు చేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరగాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారులు, మిల్లర్లకు సూచించారు. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ర్యాండమ్ విధానం వలన కొన్ని ప్రాంతాల్లో ఇబ్బంది ఎదురవుతోందని రైతులు అంటున్నారన్నారు. సమీపంలోని రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ సుధాసాగర్ మాట్లాడుతూ మండపేట ప్రాంతంలో రైస్‌మిల్లులు అధికంగా ఉన్నాయని, అయితే అమలాపురంలో ధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉన్నా ఆ స్థాయిలో మిల్లులు లేక కొంత ఇబ్బంది కలుగుతోందని వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడ చిన్న తప్పు జరిగినా ప్రభుత్వంపై బురదజల్లి లబ్ధిపొందేందుకు ప్రతిపక్ష పార్టీలు గద్దల్లా కాచుకుని ఉన్నాయన్నారు. అటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ చేయాలని సూచించారు. డీఎస్‌ఓ పాపారావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, ఆలమూరు ఏడీఏ కె.వెంకటేశ్వరరావు, రవాణశాఖ అధికారి ప్రతాప్‌కుమార్, తహసీల్దార్ రాజేశ్వరావు, ఎంఏవో సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

మలికిపురం: మండలంలో గూడపల్లిలో 2018లో జరిగిన దాడిలో ఇద్దరికి రెండు నెలల జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ రాజోలు ఏజేఎఫ్‌సీ కోర్టు జడ్జి కె.హిమబిందు శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే బాకీ విషయమై రాజోలు మండలం చింతలపల్లికి చెందిన ఇంటిపల్లి సత్యనారాయణ మలికిపురం మండలం తూర్పుపాలేనికి చెందిన వీరా కృష్ణ, వీరా సాయిలను గూడపల్లిలో అడిగాడు. ఆగ్రహించిన కృష్ణ, సాయిలు సత్యనారాయణపై దాడి చేశారు. దీనిపై అప్పటి ఎస్సై చైతన్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులు ముద్దాయిలో వీరా కృష్ణ, వీరా సాయిలకు రెండు నెలల జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు మలికిపురం ఎస్సై జి.సురేంద్ర శుక్రవారం తెలిపారు. ఈ కేసులో పీపీగా నల్లి ఆనంద్, కోర్టు కానిస్టేబుల్‌గా హసన్ వ్యవహరించారు.